ప్రజాశక్తి



యంగ్ఇండియా వ్యవస్థాపకుడు..

నరేంద్రసింగ్ బేడీ కన్నుమూత

నరేంద్ర సింగ్ బేడీ.... సంపన్న వర్గాల కుటుంబంలో జననం.. జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న యూనివర్సిటీలలో ఉన్నత చదువులు.. కష్టం అంటే ఏమిటో తెలియని జీవనంలో పెరిగిన వ్యక్తి నిరుపేదలు పడుతున్న కష్టాలను చూసి చలించారు. తాను చదివిన చదువు అణగారిన వర్గాల కోసం ఉపయోగపడాలన్న ఉన్నత లక్ష్యంతో అడుగు ముందుకేశారు. ప్రజలను చైతన్యం చేస్తూ ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశారు. యంగ్ ఇండియా స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి పేదల హక్కుల కోసం ముందుకు నడిచారు. తన జీవితాన్నీ.. ఆస్తిని ధారబోసి తుదిశ్వాశ వరకు మొక్కవోని దీక్షతో సమసమాజ స్థాపన కోసం అనునిత్యం పరితపించిన నరేంద్ర సింగ్ బేడీ(85) కన్నుమూశారు. వయోభారంతో సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి జిల్లా గుట్టూరు గ్రామంలోని తన కార్యాలయంలో తుదిశ్వాస విడిచారు.



నరేంద్ర సింగ్ బేడీ(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పెనుకొండ

పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన నరేంద్ర సింగ్ బేడీ యంగ్ ఇండియా స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలు, కార్మికుల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారు. గత 55 ఏళ్లుగా అనేక ప్రజాహిత, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనుబంధంగా వ్యవసాయ కూలీల యూనియన్లను ఏర్పాటు చేసి వ్యవసాయ కూలీల కోసం ఉద్యమాలు చేశారు. నిరుపేదలకు లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూమిని పంచడమే కాకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావాల్సిన సంక్షేమ పథకాల కోసం పోరాడారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందేలా పేదలను చైతన్య పరచడం, వికలాంగులకు ప్రత్యేకమైన నిధులను సమకూర్చి వారికి కావాల్సిన కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళా సాధికారత కోసం మహిళా సంఘాలను ఏర్పాటుచేసి, ఆర్థిక రాజకీయంగా చైతన్యవంతులు చేశారు. నిరుపేదలను స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయించి నాయకులను చేశారు. చేతివృత్తులు, సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమ వ్యాప్తంగా కూడా యంగ్ ఇండియా సేవలను కొనసాగించారు.

'ఉపాధి' అమలులో కీలకపాత్ర

వామపక్షాల మద్దతుతో యుపిఎ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపొందించడంలో బేడీ కీలకపాత్ర పోషించారు. ఉపాధి అమలు కోసం అప్పటి కేంద్ర మంత్రి వెంకటస్వామిని అనంతపురానికి పిలిపించి భారీ బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌తో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు జరిగితే నిరుపేదలకు జరిగే ఉపయోగాలను క్షుణ్ణంగా వివరించి పథకం దేశవ్యాప్తంగా అమలు చేసేలా బేడీ కృషి చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతుల సంక్షేమం కోసం బోరుబావులను తవ్వించి వారికి చేయూతను అందించారు.

పలువురు సంతాపం... నేడు అంత్యక్రియలు..


యంగ్ ఇండియా వ్యవస్థాపకుడు నరేంద్ర సింగ్ బేడీ మృతిపై పలువురు సంతాపం తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో పనిచేసిన వందలాది మంది బేడి మరణ వార్త విని కన్నీరుమున్నీరు అయ్యారు. పలువురు ఆయన మతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. మంగళవారం నాడు బేడి అంత్యక్రియలను గుట్టూరులోని యంగ్ ఇండియా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సిపిఎం నివాళి

అనంతపురం కలెక్టరేట్ : యంగ్ ఇండియా ప్రాజెక్ట్ రూపశిల్పి నరేంద్ర సింగ్ బేడీ మతిపై సిపిఎం నివాళి అర్పించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ప్రకటన విడుదల చేశారు. పేదలు, అణగారిన వర్గాల కోసం విశేష కషి చేసిన బేడీ జీవితం స్పూర్తినీయం అన్నారు. వామపక్షాల మద్దతుతో యుపిఎ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపొందించడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. 50 సంవత్సరాల కిందట జిల్లాలో ఆయన ప్రారంభించిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు పేదలకు ఎంతగానో తోడ్పడ్డాయని తెలిపారు. కరువు, రైతు ఆత్మహత్యలు, వలసలు జిల్లా గ్రామీణ జీవితాన్ని విచ్ఛిన్నం చేస్తున్నప్పుడు అనేక సంస్థలతో కలిసి వారికి తోడుగా బేడీ నిలిచారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి దూరం అవడం జిల్లాకు తీరని లోటన్నారు.

అనంత భూములపై కార్పొరేట్ కన్ను పడింది. వేలాది ఎకరాల భూములను వాటికి కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు ఇది వరకే సుముఖత వ్యక్తం చేశాయి. ఈ భూముల్లో పరిశ్రమలొస్తే ఉపాధి లభిస్తుందనుకుంటే పొరబాటే... ఉమ్మడి అనంతపురం జిల్లాలో వస్తున్నవి ఎక్కువ శాతం ఉపాధి రహిత పెట్టుబడులే కావడం గమనార్హం. జిల్లాలో వస్తున్నవి అత్యధికంగా గాలి, సోలార్ విద్యుత్ ఉత్పాదక పరిశ్రమలే ఉన్నాయి.

'అనంత భూములపై.. కార్పొరేట్ కన్ను..!



◆ సోలార్, విండ్‌కు వేలాది ఎకరాలు

◆ 20 వేల ఎకరాలకుపైగా ధారాదత్తం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు అనుమతులు పొందిన వరకే సుమారు 20 వేల ఎకరాల వరకు భూములను ఆయా కంపెనీలకు కట్టబెడుతున్నారు. సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలో 1050 మెగావాట్లు, సత్యసాయి జిల్లాలోని కనగానపల్లి, రాప్తాడు మండలాల పరిధిలో 1050 మెగావాట్లు, బొమ్మన హల్, డి.హీరేహల్ మండలాల పరిధిలో 850 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జెఎస్‌డబ్ల్యు నియో సంస్థకు ఈ భూములను కేటాయించారు. మెగావాట్‌కు ఆరు ఎకరాల చొప్పున మొత్తం 2950 మెగావాట్ల ఉత్పదానకు 17,700 ఎకరాలను ఈ మండలాల పరిధిలో సేకరించనున్నారు. ఇవి కాకుండా రాళ్ల అనంతపురం, కురబలహళ్లిలో మరో 400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. దీనికి 2400 ఎకరాలు సేకరించనున్నారు. తలుపుల మండలం పులిగుండ్ల గ్రామం పరిధిలో ఆక్వా గ్రీన్ సంస్థకు వెయ్యి మెగావాట్లకు ఏర్పాటు చేయనున్నారు. దీనికి ఆరు వేల ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. ఇవి కాకుండా డి.హీరేహళ్, బొమ్మనహళ్ మండలాల్లో ఆదానీ సంస్థకు పది వేల ఎకరాలు సేకరించాలన్న ప్రతిపాదన ఉంది. ఆ సంస్థ ప్రతినిధులు ఇది వరకే వచ్చి భూముల పరిశీలన జరిపారు. మొత్తం 30 వేల ఎకరాల వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికున్న ప్రతిపాదనలున్నాయి. ఇవి కాకుండా పారిశ్రామికవాడల పేరుతో సేకరించబోయే భూములు మురింత ఎక్కువగా ఉందని చెప్పవచ్చు.

రైతుకు శాశ్వత వలసలు తప్పవా..?

పరిశ్రమల పేరుతో సేకరిస్తున్న ఈ భూముల్లో ఉపాధి స్థానికంగా లభించే అవకాశాల్లేవు. విద్యుత్ ఉత్పదాక పరిశ్రమలతో ఉన్న భూములు కోల్పోయి స్థానికంగా పనుల్లేక రైతులు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఇప్పటికే గ్రామాల్లో ఉపాధి లేక నగరాలకు వలసలు పెరుగుతున్నాయి. ఇటువంటి పరిశ్రమలు వస్తే శాశ్వత వలసలు వెళ్లక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాలకు గ్రామాలు ఖాళీ అయ్యే అవకాశాలూ లేకపోలేదని పలువురు వాపోతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా

ప్రభుత్వానికి నివేదిస్తాం

ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణకు సంబంధించి అందించే వినతులు, అభిప్రాయాలన్నింటినీ ప్రభుత్వానికి నివేదిస్తామని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. షెడ్యూలు కులాల వర్గీకరణపై అభిప్రాయ సేకరణ నిమిత్తం అనంతపురం జిల్లాలో సోమవారం ఆయన పర్యటించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు వి.వినోద్‌కుమార్, టిఎస్.చేతన్‌తో కలిసి వివిధ ప్రజసంఘాల నాయకులు, ఎస్సీ కులాల ప్రతినిధులతో అభిప్రాయాలు, వినతులను స్వీకరించారు. ఏకసభ్య కమిషన్‌కు షెడ్యూల్ కులాల వారి నుంచి 237 విజ్ఞాపనలు అందజేశారు. వినతులు స్వీకరణతో పాటు వారి అభిప్రాయాలు సైతం ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ విన్నారు. వీటిని పూర్తిగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని కమిటీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణకు సంబంధించి అందించే సమాచారంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి, పూర్తి సమాచారాన్ని సకాలంలో సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఆయా శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలకు అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను ఉపకులాల వారిగా సమాచారాన్ని అందించాలన్నారు. ఈ వివరాలు అన్నింటినీ ప్రభుత్వానికి అందిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో అనంతపురం ఎస్పీ వి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, అడిషనల్ ఎస్పీ డివి.రమణమూర్తి, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, డీఈవో ప్రసాద్ బాబు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ సలీమ్ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ జెడి ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్యతో ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లపై అధికారుల విచారణ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల వ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులు, ఇతర పింఛన్ల పరిశీలనకు జిల్లా అధికారులు మూడు బృందాలను మండలానికి పంపినట్లు ఎంపిడిఒ దాస్‌నాయక్ తెలిపారు. అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రణీత్‌కుమార్‌రెడ్డి, అమర్నాథ్ ఆధ్వర్యంలో ఒక్కో బృందంలో ముగ్గురు సభ్యుల చొప్పున బొమ్మనహాల్, లింగదహాల్, నేమకల్లు, కురవల్లి, ఉంతకల్లు, గోవిందవాడ గ్రామాల్లో పింఛనుదారుల ఇంటికెళ్లి వారి వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలు, వారు పొందుతున్న పింఛను వివరాలు సేకరించారు. పరిశీలన పూర్తయిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఎంపిడిఒ తెలిపారు. వారికి పంచా యతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వైద్య సిబ్బంది సహకరిస్తున్నారు. మండలంలో మొత్తం 110 మంది విభిన్న ప్రతిభావంతుల ధ్రువీకరణ పత్రాలు సరిగా లేవని గుర్తించారు. వారి నుంచి ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులను సేకరించినట్లు అధికారులు తెలిపారు.

హోమియో సేవలు వినియోగించుకోండి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్



డాక్టర్ నాగజ్యోతి

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న హోమియోపతి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు నాగజ్యోతి సూచించారు. ఎపిపిఎస్ పరీక్షల్లో అర్హత సాధించిన నాగజ్యోతిని ప్రభుత్వం రాయదుర్గం హోమియోపతి వైద్యురాలిగా నియమించింది. గతంలో ఇక్కడ పని చేసిన వైద్యులు లాల్యానాయక్ ఉద్యోగోన్నతిపై అనంతపురం బదిలీ అయ్యారు. ఆ స్థానంలో రెగ్యులర్ వైద్యురాలిగా నాగజ్యోతి నియమితులయ్యారు. ఆమె సోమవారం పాత్రికేయులతో మాట్లాడుతూ అన్ని రకాల రోగాలకు ప్రభుత్వం ఉచితంగా హోమియో మందులు అందజేస్తుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో మందులు బాగా పని చేస్తాయన్నారు. హోమియోపతి మందుల వాడకంతో ఎటువంటి దుష్ఫలితాలు ఉండవన్నారు. సులభతరమైన పద్ధతిలో హోమియో మందులు వినియోగించుకోవచ్చు అన్నారు. పని వేళల్లో ఓపీ ద్వారా హోమియో వైద్య సేవలు అందిస్తామన్నారు.

హంద్రీనీవా కాలువ వెడల్పు అత్యవసరం

◆ పిల్ల కాలువలనూ మరమ్మతు చేయాలి

◆ మద్దతు ధరతో పంటలు కొనుగోలు చేయాలి

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లా రైతుల కోసం హంద్రీనీవా కాలువ వెడల్పు, పిల్ల కాలువ పనులను అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాల రంగయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవా లైనింగ్ పనుల కోసం 900 కోట్లు ప్రకటించిందన్నారు. హంద్రీనీవా కింద దాదాపు 3 లక్షల ఎకరాలలో రైతులు సాగు చేసుకోవడానికి అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరుస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చి ఇప్పటివరకు ఆ దిశగా ప్రణాళికలు రూపొందించకపోవడం విచారకరమన్నారు. హంద్రీనీవా పరిధిలో కాలువ వెడల్పుతో పాటు పిల్ల కాలువల మరమ్మతు పనులు చేపట్టి రైతాంగానికి మేలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో రైతులు సాగుచేసిన కంది పంటను అమ్ముకోవడానికి కర్నూల్ మార్కెట్‌లో దళారులను నమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రైతు సమస్యలను గుర్తించి జిల్లాలోనే కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కనేకల్, బొమ్మనహల్, డి.హీరేహళ్ తదితర మండలాల్లో వరి పంటను సాగు చేశారని, ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి పనులను పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. బాల రంగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు 2019 చట్టాన్ని రద్దుచేసి న్యాయం చేస్తామన్న హామీని ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. స్మార్ట్ మీటర్లు బిగింపును రద్దుచేసి విద్యుత్ రంగాన్ని ప్రభుత్వమే నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు శీనప్ప, రామాంజనేయులు నాయక్, వెంకటేశు లు, సిద్ధప్ప, కౌలు సంఘం నాయకులు మురళి, బాబ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి : విప్



డీఎస్సీ మెటీరియల్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డీఎస్సీ శిక్షణార్థులకు సూచించారు. టెట్, డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు పట్టణంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ కేంద్రంలో 260 మంది అభ్యర్థులు శిక్షణ పొందారు. కాలవ మాట్లాడుతూ నిపుణులచే ఔత్సాహిక అభ్యర్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన శిక్షణ ఇప్పించటం ఎంతో ఆనందాన్నిస్తోందన్నారు. ఎంత క్రమశిక్షణతో శిక్షణ పొందారో పోటీ పరీక్షలు పూర్తయ్యే వరకూ అదే ఉత్సాహం కొనసాగించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్, సర్టిఫికెట్లు అందచేశారు. బోధించిన అధ్యాపకులకు ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఇండేన్ గ్యాస్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ప్రత్యేక 'ఆధార్' కేంద్రం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న సచివాలయం-1లో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకూ ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలి పారు. అందులో ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ సేవలందిస్తారన్నారు. అవసర మైన ధ్రువపత్రాలు సమర్పించి అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకూ మరోమారు ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నందకిషోర్ సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం ఎరడికెర, 23, 24న వెస్ట్ కోడిపల్లి, 27, 28న పోలేపల్లి, భైరవానితిప్ప, 29,30న గుండిగానిపల్లి గ్రామంలో ఆధార్ క్యాంపు నిర్వహిస్తామన్నారు.

మాజీ ఉప సర్పంచి మృతికి ఎమ్మెల్యే సంతాపం

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని ముద్దినాయనపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచి ఎరుకుల నాగభూషణ సోమవారం మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నాగభూషణ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. నాగభూషన మృతి టిడిపికి తీరని లోటు అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పాలవెంకటాపురం రామ్మోహన్‌చౌదరి, స్థానిక టిడిపి నాయకులు నాగభూషణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందజేశారు.

చిల్డ్రన్స్ హోం నిర్వహణ మెరుగవ్వాలి : సిడిపిఒ



చిల్డ్రన్స్ హోంను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కణేకల్లు

చిల్డ్రన్స్ హోంలో డాక్యుమెంట్స్ నిర్వహణ మరింత మెరుగవ్వాలని కణేకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ లక్ష్మీప్రసన్న సూచించారు. కణేకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆర్‌డిటి, చిల్డ్రన్స్ హోంలను సోమవారం జిల్లా పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో సంద ర్శించారు. ఇందులో భాగంగా ఆమె ప్రస్తుత వారి పరిస్థితులు, పనితీరు, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. బాలల న్యాయచట్టం-2015 ప్రకారం చిల్డ్రన్స్ హోం రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో సందర్శించామని జిల్లా కమిటీ తెలిపింది. స్థానిక పరిస్థితులు, యాజమాన్యం, డాక్యుమెంట్స్ నిర్వహణ, మౌలిక వసతులు, తదితర అంశాలపై పర్యవేక్షణ కమిటీ జిల్లా కలెక్టర్‌కు తుది నివేదిక అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షణ టీం కన్వీనర్ ఫరూక్‌బాషా, పర్యవేక్షణ అధికారి కో కన్వీనర్ ఆర్.మంజునాథ, వెంకటేశ్వరి, సంధ్యారాణి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి- రాయదుర్గం రూరల్

ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు ప్రబలకుండా కాపాడుకోవచ్చునని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్ర తెలిపారు. మండలంలోని ఆవులదట్ల గ్రామంలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, ఎఎన్ఎం మారుతీశ్వరి, ఆశా కార్యకర్తలు లక్ష్మీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

భూ రీ సర్వే పరిశీలన

ప్రజాశక్తిలి-కళ్యాణదుర్గం రూరల్



రీ సర్వేను పర్యవేక్షిస్తున్న ఆర్డీవో వసంత్ బాబు

మండలం లోని దురదకుంట గ్రామంలో జరుగుతున్న భూ రీ-సర్వే పనులను సోమవారం ఆర్డీవో జి.వసంత బాబు పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ సర్వేకు వెళ్లే ముందు సంబంధిత రైతులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలన్నారు. హాజరు కాని రైతులకు కనీసం 3సార్లు అవకాశం ఇవ్వాలన్నారు. రీ-సర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు రీ-సర్వేకు హాజరై అధికారులకు సహకరించాలని కోరారు. ఆర్డీవో వెంట డివిజనల్ సర్వేయర్, కళ్యాణదుర్గం రీసర్వే డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి, విలేజ్ సర్వేయర్లు, రైతులు ఉన్నారున.

గుండిగానిపల్లిలో రీ సర్వే ప్రారంభం

బ్రహ్మసముద్రం : మండలంలోని గుండిగానిపల్లి గ్రామంలో సోమవారం రీ సర్వే పనులను ప్రారంభించినట్లు తహశీల్దార్ సుమతి తెలిపారు. రెండు బృందాలు భూ రీ సర్వే పనులను చేపట్టాయని, 5 సర్వే నెంబర్లలో 20 మంది రైతులకు గానూ 40 ఎకరాల్లో రీ సర్వే పనులు పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సువర్ణ, ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో ఆంజనేయులు, టిడిపి నాయకులు కురుగౌడ, నాగిరెడ్డి, కేశవర్ధన్‌గౌడ్, బజ్జన్నగౌడ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి :ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్



విలేకరుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

రాజకీయ పార్టీలను పక్కన పెట్టి మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకరినొకరు విమర్శించుకుంటూ పోతే అభివృద్ధి కుంటుపడుతుందని, రాజకీయ పార్టీలను పక్కనపెట్టి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిం చాలని కోరారు. కాగా ఎమ్మెల్యే తన పక్కనే కుర్చీ వేయించి మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్‌కు ప్రత్యేకంగా గౌరవమిచ్చారు. అందరి ఆమోదంతో కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు, వైసిపి కౌన్సిలర్లు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి మీ అడుగుజాడల్లో నడుస్తామని తెలిపారు.

రహదారి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కుందుర్పి

స్థానిక పెట్రోల్ బంకు సమీపం నుంచి రామస్వామి ఆలయం వరకూ ఆర్‌అండ్‌బికి చెందిన రహదారిని కొందరు ఆక్రమించారని సోమవారం తహశీల్దార్ కార్యాయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో టిడిపి నాయకులు తహశీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ప్రధాన రహదారి గుండా ఇరువైపులా రహదారిని ఆక్రమించారని, దీంతో మురుగునీరు రోడ్డుపై పారుతుందని తెలిపారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచి పెద్దనరసింహప్ప, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, ఆయకట్టు చైర్మన్ రామ్మూర్తినాయుడు, టౌన్ కన్వీనర్ చెల్లూరు రంగనాథ్, బేల్దారి వెంకటేశులు, బసప్ప, గొల్లపల్లి ప్రసాద్ ఉన్నారు.

జగ్జిత్‌సింగ్ దీక్షకు మద్దతుగా నిరసన



నిరసన తెలుపుతున్న రైతు, కౌలురైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జగ్జిత్‌సింగ్ చేపట్టిన దీక్షలకు మద్దతుగా సోమవారం ఉరవకొండలో రైతుసంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిరంతర ఉదాసీనతతోపాటు దేశ వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అత్యంత తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు జగ్జిత్‌సింగ్ 2025 నవంబర్ 26 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారన్నారు. 53 రోజులుగా తిండిలేక ఆయన ఆరోగ్యం ప్రమాదకర స్థితిలో ఉన్నా కేంద్రం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అన్ని రైతుసంస్థలు, ముఖ్యమంత్రులు, అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, రైతుసంఘం నాయకులు సీనప్ప, వెంకటేశులు, వీరాంజనేయులు, రవికుమార్, మురళి, సిద్ధప్ప, రామాంజనేయులు నాయక్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయరామ్

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని రోడ్డు విస్తరణ బాధితులకు తగిన న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం నుంచి ప్రభుత్వాసుపత్రి వరకూ చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే కాలినడకన వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ బాధితులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించాలన్నారు. బాధితులతోపాటు అర్హులైన వారికి ప్రభుత్వ స్థలాలు ఇచ్చి ప్రభుత్వ నివాస గృహాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్, సభ్యులుగా మెడికల్ ఆఫీసర్ శివకార్తీక్‌రెడ్డి, సభ్యులుగా ఎంపిడిఒ తేజోష్ణ, పంచాయతీ అధికారి గోపాల్, చిలకల రాజగోపాల్, పూజారి లక్ష్మీదేవి, డాక్టర్ శ్యామలను ఎన్నుకున్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి సీనియర్ నాయకులు ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ గౌస్‌పీరా, జింకల సంజీవకుమార్, ముసిలిరెడ్డి, సుంకిరెడ్డి, బొమ్మా మోహన్, వడ్డే శివ, కరూరు శివ, కొట్టం మాలిక్, తేల్‌బాషా, మహమ్మద్ రఫీ, వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ పనులు ప్రారంభం

నార్పల : మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో కొద్దిరోజులుగా వివాదాస్పదంగా మారిన డ్రెయినేజీ పనులు ఎట్టకేలకూ సోమవారం బందోబస్తు నడుమ ప్రారంభమయ్యాయి. ఆయా పనులను ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జనార్ధన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రామేశ్వరి, చంద్రబాబు పర్యవేక్షిస్తున్నారు. ఆయా పనులను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు.

22, 27 తేదీల్లో పింఛన్ల తనిఖీ

నార్పల : మండలంలో వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారిపై ఈనెల 22, 27వ తేదీల్లో రీ వెరిఫికేషన్ చేయనున్నట్లు ఎంపిడిఒ గంగావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పరిశీలన బృందాలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించనున్నట్లు తెలిపారు.

నేడు మండల సమావేశం

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మూడు నెలల కాలవ్యవధిలో శాఖల వారీగా అభివృద్ధి పురోగతిపై సమీక్షించనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని జడ్పిటిసిలు, కోఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

కబరస్తాన్‌లో చెత్తాచెదారం తొలగింపు

సిపిఎంకు ముస్లిముల కృతజ్ఞతలు




కబరస్థాన్‌లో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరంలోని హెచ్‌ఎల్‌సి కెనాల్ వద్ద ఉన్న కబరస్థాన్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం ముళ్లకంపలను సోమవారం తొలగించారు. కబరస్థాన్‌లో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే కబరస్థాన్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం ముళ్లకంపలను తొలగించాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. దీంతో కబరస్థాన్‌లో చెత్తాచెదారం తొలగించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేకు సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, నాయకులు ఆర్‌వి.నాయుడు, వలి, ప్రకాష్‌కు ముస్లిములు ధన్యవాదాలు తెలిపారు.

'ఉపాధి' కల్పించి వలసలను నివారించాలి

రైతుసంఘం నాయకుల వినతి



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పనులు కల్పించి వలసలను నివారించాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్యకు ఎపి రైతుసంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించకపోతే వలసలు పోయే ప్రమాదం ఉందన్నారు. కావున ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించడంతోపాటు రోజుకు రూ.600 కూలి పడేలా చూడాలని కోరారు. అలాగే గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలన్నారు. అలాగే ఇల్లు లేని పేదలకు మూడు సెంట్ల ప్రకారం ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. వీటితోపాటు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కందులు క్వింటా రూ.7500 ప్రకారం మద్దతు ధర ఇవ్వడంతోపాటు రూ.1వేల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయరాముడు, రామాంజనేయులు, బాలరాజు, పి.శ్రీనివాసులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

పుట్లూరు : మండలంలో మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21, 22న కోమటికుంట్ల, కడవకల్లు, మడ్డిపల్లి, 23, 24న బాలాపురం, చెర్లోపల్లి, కుమ్మనమల, 27, 28న పుట్లూరు, అరకటివేముల, వెల్లుట్ల, 29, 30న ఎస్.గూడూరు, కందికాపుల, మడుగుపల్లి సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రీసర్వే పరిశీలన



రీ సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్ బ్రహ్మయ్య

శింగనమల : మండల పరిధిలోని పెద్దమట్లగొంది గ్రామంలో సోమవారం చేపట్టిన రీసర్వేను తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య పరిశీలించారు. ఇందులో భాగంగా సర్వే సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. ముఖ్యంగా భూములను కొలిచేటప్పుడు రైతులు పొలాల్లోనే ఉండాలన్నారు. సిబ్బంది కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించి రైతులకు తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ పునీత్‌కుమార్, మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, సర్వేయర్లు, వీఆర్వో తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌విలో 'వంతెన-7.0' ప్రారంభం



వంతెన 7.0 ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాలలో సోమవారం వంతెన 7.0ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి మాట్లాడుతూ చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కరణ, వ్యవస్థాపకతను పెంపొందించే ఎస్‌కెయు మిషన్‌లో వంతెన 7.0 మరో మైలురాయి అన్నారు. తద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వారి ఆలోచనలకు జీవం పోయడానికి మార్గం సుగమం అవుతందన్నారు. ఈకార్యక్రమంలో ఈనెల 31వతేదీ వరకూ కొనసాగుతుందన్నారు. అనంతరం ఎఐసి-ఎస్‌కెయు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగ భూషణ్‌రాజు పట్టుదల, ఆవిష్కరణల ప్రాముఖ్యతను నొక్కిచెప్పడం ద్వారా ఆలోచనలను ప్రత్యక్ష ఉత్పత్తులుగా మార్చవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఐసి-ఎస్‌కెయు సిఇఒ సి.చంద్రమౌళి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎ వి ప్రసాద్, కళాశాల ఎఐసి కన్వీనర్ ఎస్.రిజ్వానా బేగం, ఎఐసి -ఎస్‌కెయు ఇంక్యుబేషన్ అసోసియేట్ పి.జ్యోతి, ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మక విద్యాసంస్థలకు చెందిన దాదాపు 40మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టం, ప్రతిభను నమ్ముకుంటే ఉద్యోగం మీదే..

డిఇఒ ప్రసాద్‌బాబు, డిఎండబ్ల్యూఒ రామసుబ్బారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఇఒ ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి-అనంతపురం

పోటీ పరీక్షల అభ్యర్థులు తమ కష్టంతోపాటు ప్రతిభను నమ్ముకుంటే ఉద్యోగం తప్పనిసరిగా వస్తుందని డిఇఒ ప్రసాద్‌బాబు, డిఎండబ్ల్యూఒ రామసుబ్బారెడ్డి సూచించారు. సోమవారం అనంతపురంలోని రఘువీరా టవర్స్‌లో ఉన్న తేజ అకాడమీలో డీఎస్సీ ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ ఫలితాల్లో విశేష ప్రతిభ కనపరుస్తున్న తేజ అకాడమీ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచిత తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అలాంటి రంగాన్ని ఎంచుకుని శిక్షణ పొందుతున్న వారికి ముందుగా శుభాకాంక్షలు తలెఇపారు. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల అవుతుందని, కష్టపడి చదివితే ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. పోటీ పరీక్షల్లోనే కాకుండా తేజ జూనియర్ కళాశాలలో కూడా ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు ఇస్తున్న డైరెక్టర్ తేజేశ్వరరెడ్డిని అభినందించారు. అభ్యర్థులు పోటీ పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో తేజ అకాడమీ చైర్‌పర్సన్ ఉమాదేవి, బయాలజీ ఫ్యాకల్టీ శివరామకృష్ణ వివరించారు. కాగా పేద అభ్యర్థుల కోసం త్వరలోనే ఎపి కానిస్టేబుల్ మెయిన్స్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తేజ అకాడమీ డైరెక్టర్ జి.తేజేశ్వర్‌రెడ్డి తెలిపారు. అంతకుముందు డిఇఒ, డిఎండబ్ల్యూఓలను తేజా అకాడమీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తేజ అకాడమీకి చెందిన మౌనిక, ఫాతిమా, కస్తూరి, షంషాద్, వెంకట్‌రెడ్డి, వెంకటేష్ ప్రసాద్‌రెడ్డి, రజిత్, మధు తదితరులు పాల్గొన్నారు.

గైనకాలజిస్టును నియమించాలని వినతి

పామిడి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక గైనకాలజిస్టును నియమించాలని సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రికి మండలంలోని గ్రామాలతోపాటు పొరుగు మండలాల నుంచి రోజూ అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. కావున ఆసుపత్రికి వచ్చే రోగులకు తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా గైనకాలజిస్టును నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మల్లేష్, ముత్యాలు, ఈశ్వరయ్య, శంకర్, శివకుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితోనే 'ఉక్కు' భరోసా

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం వచ్చిందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. అనేకమంది విరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవానికి ఎన్‌డిఎ ప్రభుత్వం అన్నివిధాలా సహకారం అందిస్తుందన్నారు. గత వైసిపి హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కేవలం తన కేసులను మాఫీ చేసుకునేందుకే ఢిల్లీకి వెళ్లేవారన్నారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం చంద్రబాబు కేవలం అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలకే ఢిల్లీకి వెళు తున్నారన్నారు. ఇందులో భాగమే ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినేట్ కమిటీ ఆమోదముద్ర వేసిందన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సహాయ సంచాలకులు ఎవి.రత్నకుమార్



బుక్కరాయసముద్రం మండలంలో పాల్గొన్న అధికారులు, రైతులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎవి.రత్నకుమార్ సూచించారు. సోమవారం మండలంలోని దయ్యాలకుంటపల్లి, చెదుళ్ల గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని పశువులకు వచ్చే రోగాలను గుర్తించడంతోపాటు అవసరమైన మందులను సరఫరా చేసేందుకే ప్రభుత్వం పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. కావున రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని పశువులను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దయ్యాలకుంటపల్లి సర్పంచి రమేష్, ఇన్‌ఛార్జి పశువైద్య అధికారి డాక్టర్ దిలీప్, పశు వైద్య సహాయకులు భానుప్రకాష్, రైతు సేవాకేంద్రాల సహాయకులు ప్రవీణ్, రజాక్, చైతన్య, వన్నూరుస్వామి, సరస్వతి, సాయి, గీత, తదితరులు పాల్గన్నారు.

నార్పల : మండలంలోని బొందలవాడ, చామలూరు గ్రామాల్లో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు మండల పశు వైద్యులు గోవిందరాజు తెలిపారు. ఇందులో భాగంగా గొర్రెలు, మేకలు, పాడి పశువుల రైతులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పామిడి : మండలంలోని పాళ్యం తండా ఎంపియుపి పాఠశాల ఆవరణలో హరిత దివ్యాంగుల సేవాసమితి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు బి.మోహన్‌నాయక్, గోపాల్, రమణ, రామకృష్ణ, భాస్కర్, అశోక్, రమేష్, రామాంజి, చంటి, రాజశేఖర్, శ్రీనివాస్‌నాయక్, అంజనేయులునాయక్, ధరణినాయక్, రవినాయక్, కుమార్‌నాయక్, మణికంఠనాయక్ పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా 'భాష్యం' క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం సమీపంలోని ఆర్డీటీ క్రీడాగ్రామంలో భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా సాగతింది. ఈ టోర్నమెంట్‌ను ఐపిఎల్ ముంబై టీం మాజీ క్రికెటర్ షాబుద్దీన్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించే ఏకైక విద్యాసంస్థ భాష్యం అన్నారు. అనంతరం ఈస్ట్ గోదావరి ఎం పేరర్స్-అనంతపురం ఎవేంజర్స్ మధ్య పోటీ నిర్వహించగా ఈస్ట్ గోదావరి ఎంపరర్స్ జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ, వైస్‌ఛైర్మన్ హనుమంతురావు, డైరెక్టర్ సాకేత్ రామ్, రాయలసీమ సిఇఒ అనిల్‌కుమార్, అనంతపురం జోన్ జెడ్ఇఒ రవివర్మ, ఈస్ట్ గోదావరి జిల్లా జెడ్ఇఒ ఆంజనేయులు, ప్రిన్సిపాళ్లు బాలకృష్ణ, ప్రణీత, హరిబాబు, జెడ్‌సిఒ భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



ఎరువులను పరిశీలిస్తున్న ఎడిఎ రవి

అనంతపురం : జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ ఆదేశాలు మేరకు అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ రవి సోమవారం సిరుగుప్ప ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ అందజేసిన ఎరువులు, రైతులకు సరఫరా చేసిన ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గార్లదిన్నె వ్యవసాయ అధికారి సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అప్పీలు చేసుకున్న అభ్యర్థులకు నేడు దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలో గతనెల 30వ తేదీ నుంచి నిర్వహించిన కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకాలేక అప్పీలు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహధారుడ్య పరీక్షలు సోమవారం యథావిధిగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఎస్పీ దగ్గరుండి సిసి కెమెరాల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించారు. వేకువజామునే హాజరైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు పరిశీలన అనంతరం ఎత్తు, ఛాతి కొలతలు, 1,600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ వంటి పరీక్షలు నిర్వహించారు.

రాత్రివేళ పటిష్ట భద్రతా చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు రాత్రివేళల్లో పోలీసులు జిల్లావ్యాప్తంగా బందోబస్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా రాత్రివేళల్లో భద్రత కోసం నైట్ రౌండ్స్ అధికారులు నిరంతరం బీట్ పాయింట్లను తనిఖీ చేస్తూ ఆలయాలు, ప్రార్థన మందిరాలు, ఎటిఎం కేంద్రాలు, బ్యాంకులు, ఇతర ముఖ్య వ్యాపార సముదాయాల వద్ద సిబ్బందిని అప్రమత్తంగా విధుల్లో నిమగ్నం చేస్తున్నారు. నేరాల నియంత్రణ, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతూ భద్రతా చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీలు చేపట్టడం, ఓపెన్ డ్రింకింగ్‌ల కట్టడిపై దృష్టి సారించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. వాహన రికార్డుల పరిశీలన, ప్రయాణికుల వివరాల సేకరణ, అనుమానిత వ్యక్తుల వేలిముద్రలు తీసుకునే కార్యక్రమాల ద్వారా దొంగతనాలు, అక్రమ రవాణా, ఇతర నేరాలను నియంత్రించడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

కె.విజయ్‌కు డాక్టరేట్



అనంతపురం కలెక్టరేట్ : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో యూనివర్శిటీ ప్రిన్సిపాల్, మాజీ రిజిస్ట్రార్ కృష్ణకుమారి పర్యవేక్షణలో కరువు పీడిత అనంతపురం జిల్లా మున్సిపాలిటీస్ శ్రామిక జనాభా స్థితిగతులపై పరిశోదన చేసినందుకు కె.విజయ్ పిహెచ్‌డి డాక్టరేట్ పొందారు. కె.విజయ్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా ఛైర్మన్‌గా పని చేస్తున్నారు. అనంతపురం నగరంలో నివాసమున్న విజయ్ న్యూటౌన్ బాలుర జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ బైపిసి, ఆర్ట్స్ కాలేజ్‌లో బిఎస్‌సి బయో కెమిస్ట్రీ, ఎస్ కె యూనివర్శిటీ జాగ్రఫీ విభాగం నందు పిహెచ్‌డి పరిశోధనను పూర్తి చేశారు. అందుకు వర్శిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు.

నేడు 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే'

అనంతపురం రూరల్ : నగరంలో మంగళవారం మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా అశోక్‌నగర్ ఉర్దూ స్కూల్ నుంచి కార్యక్రమం ప్రారంభమై ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు.

'పరిటాల' వర్థంతిని జయప్రదం చేయండి

ఆత్మకూరు : రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో ఈనెల 24వతేదీన నిర్వహించనున్న మాజీమంత్రి పరిటాల రవీంద్ర వర్థంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాధించుకున్న పరిటాల రవీంద్ర ఘాట్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి నివాళులర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ వేణుగోపాల్, నాయకులు వెంకట్ నారాయణ, అంకే సీనియర్ నాయకులు పొట్టే నరసింహులు, అశ్వర్థనారాయణచౌదరి, అక్కులన్న, ఎర్రిస్వామి, మూడిండ్ల ఆది, పాపంపల్లి వెంకటేశు లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామైక్య సంఘాల లీడర్లకు శిక్షణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

నూతనంగా ఎంపికైన మండల పరిధిలో గ్రామైక్య సంఘాల లీడర్లకు సోమవారం వెలుగు కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎపిఎం నారాయణస్వామి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల బరోపేతానికి లీడర్లు కీలకంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని నిరుపేదలను గుర్తించి కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా బ్యాంకు రుణాలు, శ్రీనిధి, ఉన్నతి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, తదితర వాటిపై మహిళా సంఘాల సభ్యులకు వివరిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, ఇందిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎపిఎం నారాయణస్వామి

రంగరాయుని విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి

శింగనమల : మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద శ్రీరంగరాయుల విగ్రహం ఏర్పాటు చేయాలని శ్రీరంగరాయుని సేవాసంఘం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రంగరాయుని సేవాసమితి సంఘం అధ్యక్షులు జైరామ్‌చరణ్ యాదవ్, సభ్యులు లక్ష్మీనారాయణ, మిట్ట పవన్‌కుమార్, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ షర్మిల

బెలుగుప్ప : ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహశీల్దార్ సి.షర్మిల సోమవారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా రాస్తూ వార్తలను ప్రజలకు చేరవేస్తున్న ప్రజాశక్తి దినపత్రిక దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమాదేవి, విఆర్ఒలు ఎర్రిస్వామి, ఈశ్వర్‌రెడ్డి, రమేష్, రాజశేఖర్, చంద్రశేఖర్, మధు, నగేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఆశాకార్యకర్తలు చేపట్టిన కుష్టువ్యాధి సర్వేను డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రామచంద్ర, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్ పరిశీలించారు. ఇందులో భాగంగా సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పరమేశ్వర్, సూపర్‌వైజర్, రామ్‌ప్రసాద్‌గౌడ్, ఆశా కార్యకర్త లక్ష్మి, నాగ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డిని కలిసిన పుట్లూరు మండల రైతులు



జెసి అస్మిత్‌రెడ్డితో పుట్లూరు మండల రైతులు

పుట్లూరు : పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు హెచ్చెల్సీ నీరు వచ్చేందుకు కృషి చేసిన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డిని మండల రైతులు సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, పుట్లూరు సాగునీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ రవికుమార్‌రెడ్డి, రామచంద్రనాయుడు, వెంకటనారాయణరెడ్డి, తాజ్, వీరయ్య, వెంకట్ రాముడు, వెంకట సుబ్బారెడ్డి, రామానాయుడు, గోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రీసర్వేకు సహకరించాలి

బెలుగుప్ప : గ్రామాల్లో చేపట్టనున్న భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ షర్మిల కోరారు. సోమవారం మండల పరిధిలోని అగపర్తి గ్రామంలో చేపట్టిన రీసర్వేను టిడిపి సీనియర్ నాయకులు రాధాకృష్ణ భూమిపూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సర్వేల్లో కొన్ని జాయింట్ ఎల్‌పి నెంబర్లు వచ్చాయని, వాటిని పూర్తిగా నివారించడానికి రైతులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్, విఆర్ఒలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రికార్డులు చోరీ

పుట్లూరు : మండలంలోని వెంకన్నపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో రికార్డులను చోరీ చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సంక్రాంతి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు చోరీ జరిగినట్లు గుర్తించారు. పాఠశాలలోకి వెళ్లి చూడగా తాళం చెవిని పగులగొట్టి రికార్డులతోపాటు టెస్టు బుక్కులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. హెచ్ఎం సుధాకర్‌రెడ్డి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలేయ మార్పిడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని నేసే పేటకు చెందిన కొత్త అనిల్ కుమార్, కొత్త అనితల కుమార్తె 3సంవత్సరాల నిహాన్వి పుట్టుకతోనే కాలేయ సమస్యతో బాధపడుతోంది. వైద్యుల సలహా మేరకు కాలేయ మార్పిడి చేయించాల్సి ఉండగా అందుకోసం తగినంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను బాధితులు ఆశ్రయించారు. హైదరాబాదులోని గ్లెన్ఈగల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ చిన్నారి కాలేయ మార్పిడి ఆపరేషన్ కోసం మంత్రి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వెంటనే రూ. 10 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్‌తో పాటు మంత్రి లేఖను మంత్రిగారి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు సోమవారం ఆ చిన్నారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డోలా రాజారెడ్డి, ఎర్రజోడు లోకేష్, జుటూరు వెంకటేష్, పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర్, సాకే ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ముదిగుబ్బ : మండలంలోని కొండగట్టుపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు మంజూరైన సిసి రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ , క్లస్టర్ ఇన్చార్జి తుమ్మల మనోహర్ , రమేష్ బాబు , కోట్ల బాబి , తుమ్మల సూరి ,సోముల ప్రకాష్ నాయుడు, సర్పంచి కత్తిం పాపయ్య పాల్గొన్నారు.

25న సర్వసభ్య సమావేశం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 25న శనివారం ఎంపిపి సి.పెద్దన్న అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

పామిడి : మండల కేంద్రంలోని కొండూరు రోడ్డులో వెలిసిన అంకాళమ్మ, కుంటెమ్మ అమ్మవార్ల జాతర సందర్భంగా సోమవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉరుములు, వాయిద్యాల మధ్య ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా భక్తులు అడుగడుగునా ఫల పుష్పాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్



గురుకుల పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింధూర రెడ్డి

విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు సాధ్యమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. బుక్కపట్నంలోని మహాత్మ జ్యోతిబా పూలే బిసి సంక్షేమ బాలికల వసతి పాఠశాలకు ప్రభుత్వం నుంచి తగినంత నిధులు తీసుకొచ్చి వాటిని అతి త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి నూతన గురుకుల పాఠశాలను ప్రారంభిస్తామనితెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న విద్యాసంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు అభ్యసించాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే ప్రతి మనిషికి తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. విద్యార్థులు సంక్షేమం కోసం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విరాళం అందించిన రూ. 50 వేల రూపాయల విలువచేసే ఫ్యాన్లు, ప్రజెక్టర్, ఇన్వర్టర్‌ను మహాత్మ జ్యోతి బా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రమాదేవి, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు పిసి గంగన్న, బెస్త చలపతి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతుల వెల్లువ



వినతిని అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

శింగనమల : ఎస్‌సి రిజర్వేషన్ శాతంలో ఉపకులాలకు సమన్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి నాయకులు బండారు కుళ్లాయప్ప కోరారు. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో రెవెన్యూ భవన్‌లో ఎస్‌సి వర్గీకరణ అమలుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రాకు ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలో దాదాపు 8వేల పైచిలుకు ఎస్సీ జనాభా ఉందన్నారు. ఇందులో 90 శాతం మాదిగ సామజికవర్గానికి చెందిన వారు ఉన్నారన్నారు. వీరందరూ ఉమ్మడి రిజర్వేషన్ విధానం వల్ల నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్‌సి 59 ఉపకులాలకు సమన్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు హెచ్.లింగమయ్య, తిరుపతయ్య, ఆంజనేయులు, వెంకటేశు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రాష్ట్ర స్థాయి జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎంఆర్‌పిఎస్, డిజిహెచ్‌ఎస్‌ఎస్ నాయకులు కోరారు. సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో రెవెన్యూ భవన్‌లో ఎస్‌సి వర్గీకరణ అమలుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రాను ఎంఆర్‌పిఎస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో డిజిహెచ్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు మీనుగ గోపాల్, రాష్ట్ర అధ్యక్షులు సాకే రమేష్, జిల్లా అధికార ప్రతినిధి సోముశేఖర్, కూడేరు లక్ష్మన్న, రాజు, రామాంజినేయులు, ముత్యాలు, లక్ష్మీనారాయణ, రాజు, కందేపల్లి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలందరూ సమానమే

ప్రజాశక్తి-హిందూపురం

వివిధ తప్పులు చేసి కారాగారాలకు వచ్చే ఖైదీలందరూ అధికార దృష్టిలో ఒక్కటేనని జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ఖైదీల నడుమ ఎలాంటి కులవివక్షకు తావు లేదని ఆయన చెప్పారు. సోమవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపకారాగారంలో కుల వివక్షకు ఏ మాత్రం తావు లేదన్నారు. అలా ఎక్కడైనా వివక్ష చూపుతుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని నిందితులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనారోగ్యాలకు గురైన ఖైదీల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని తెలిపారు. అదే విధంగా 18 ఏళ్ల లోపు, 70 ఏళ్ళు పైబడిన నిందితులు ఎవరైనా జైలులో ఉన్న సంబంధిత జైలు అధికారి తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, న్యాయవాది సంతోషి కుమారి, ఉపకారాగార అధికారి హనుమన్న, లోక్ అదాలకు సిబ్బంది హేమావతి, పారా లీగల్ వాలంటీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటివైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చూపులేని పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే రోటరీ క్లబ్ ధ్యేయమని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్ గుప్తా, క్యాంపు చైర్మన్ విజయ్ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శంకరా కంటి ఆసుపత్రి- బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనంతపురం జిల్లా వారి సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి దాతలుగా సింగం రెడ్డి వెంకట లక్ష్మమ్మ, సింగం రెడ్డి రామిరెడ్డి, వారి కుమారుడు సింగం రెడ్డి వెంకటరామిరెడ్డి కోడలు సింగం రెడ్డి మమత వ్యవహరించడం పట్ల నిర్వాహకులు వారిని సత్కరించారు. ఈ శిబిరంలో 98 మందికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించగా 75 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ సత్రశాల ప్రసన్నకుమార్, అసిస్టెంట్ గవర్నర్ రత్నశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరేందర్ రెడ్డి, కృష్ణమూర్తి, రామకృష్ణ, కొండయ్య, రమేష్, పెరుమాల దాస్ పాల్గొన్నారు.



దేహదాన పత్రాన్ని అందిస్తున్న డా॥మాణిక్యరావు

జర్నలిస్టులు సమాజ సేవకులు

ప్రజాశక్తి-అనంతపురం

జర్నలిస్టులు సమాజ సేవకులు అని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు కొనియాడారు. ఈనెల 7న మృతిచెందిన సీనియర్ జర్నలిస్టు నందిని దేవప్రసాద్ (జెమిని ప్రసాద్) పార్థీవదేహాన్ని మెడికల్ కళాశాల వైద్య విద్యార్థుల శాస్త్ర విజ్ఞానం కోసం అందించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో సోమవారం ఇందుకు సంబంధించిన దేహదాన ప్రశంసాపత్రాన్ని జర్నలిస్టులు చల్లా కెనాయుడు, ప్రజాశక్తి రవిచంద్రకు అందించారు. ఈ సందర్భంగా మాణిక్యరావు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుళ్తూ ఉంటారన్నారు. వారి సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అనాటమీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

బ్రహ్మసముద్రం : మండలంలోని గుండిగానిపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు ఏవో సరిత తెలిపారు. గ్రామానికి 25 టన్నుల యూరియా మంజూరైంది. 324 మందికి గానూ 130 మంది రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియాను రెండు రోజులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సౌమ్య, టిడిపి నాయకులు నాగిరెడ్డి, కేశవర్ధన్‌గౌడ్, బజ్జన్నగౌడ, తిప్పేస్వామి, భీమిరెడ్డి, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు

రాయదుర్గం : సచివాలయ ఉద్యోగులకు అన్యాయం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగుల్లో 90 శాతం బహుజనులే ఉన్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందే కానీ వారికి పూర్తి స్థాయిలో ఉద్యోగ భద్రత, భరో సా, ఉద్యోగోన్నతులకు సంబంధించి విధి విధానాలు ఏర్పాటు చేయకుండా గాలికి వదిలేసిందన్నారు. దీంత వారు నూతన ప్రభుత్వంపై ఆశలు పెట్టుకుంటే వారికి అన్యాయం చేయాలని చూడడం దుర్మార్గ మన్నారు. రేషనలైజేషన్ పేరుతో మోసం చేయాలని చూస్తుందన్నారు. వాలంటీర్ వ్యవస్థను తీసివేసి వారి పనిని సెక్రటరీలతోనే చేయించడం వల్ల వారి పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల అభీష్టం మేరకు మాతృశాఖలో విలీనం చేయాలని, జిఒ-423 రద్దు చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు.

అనుష్టానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బ్రహ్మసముద్రం

శ్రీముమ్మడి శాంత లింగేశ్వరస్వామి అనుష్టానం చేసి 26 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమ వారం మండలంలోని ముప్పలకుంట గ్రామంలో అనుష్టానోత్సవం నిర్వహించారు. కేదార్‌నాథ్ ఆలయ ఆస్థాన స్వామిజీ శ్రీనాల్వాడీ శాంతలింగేశ్వరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆ గ్రామం వెళ్లి నాల్వాడి శాంత లింగేశ్వరస్వామి ఆశీర్వాదం పొందారు. గ్రామంలో స్వామి వారి ఊరేగింపు, ధ్వజారోహణం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు వెంకటేశులు, చిత్తప్ప ఉన్నారు.

పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి- రాయదుర్గం రూరల్

పశువుల ఆరోగ్యం, ఉత్పాదకత పెంపు, వ్యాధుల నివారణ, పశుపోషణ ఖర్చులను తగ్గించి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని మలకపురం, వద్రహొన్నూరు గ్రామాల్లో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా, దూడలకు నట్టల నివారణ మందు, గొర్రెలకు బొబ్బ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఎదకురాని పశువులు, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పశుపోషకుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో జుంజురాంపల్లి సర్పంచి వన్నూరు స్వామి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని మంగళకుంట, బోరంపల్లి గ్రామాల్లో డాక్టర్ మంజునాథ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశు వులకు గాలికుంటు టీకా, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

రహదారి భద్రత మాసోత్సవాలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వాహనదారులకు రహదారి భద్రత పైన అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నియమాలకు సంబందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ వరప్రసాద్, ఎఎంవిఐ రాజేష్, పట్నం పోలీసులు పాల్గొన్నారు.